క్లుప్తంగా

గురుకుల అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమ్మదనం గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం పొందాలనేకునే విద్యార్థులు రూ.100 రుసుమును చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18నుంచి 2024 జనవరి 06 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. దరఖాస్తు చేసేందుకు 4వ తరగతి బోనోఫైడ్, స్టడీ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియలో సరైన వివరాలను పొందుపరచాలని, సందేహాలుంటే హెల్ప్ నంబర్ 18004254567‌8ను సంప్రదించాలని కోరారు. హెల్ప్‌లైన్ నంబర్‌కు ఉదయం 10:30గంటలనుండి సాయంత్రం 5గంటల అందుబాటులో ఉంటుందని చెప్పారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు టెంకాయల వేలం

కేశంపేట: వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా టెంకాయల అమ్మకానికి బుధవారం వేలం వేయనున్నట్లు సర్పంచ్ మంజుల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఏఐఎఫ్‌బీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూరు: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని పార్టీనేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన అనుచరులతో కలిసి మండల పరిధిలోని సిద్ధాపూర్, వైఎం తండా, ఎస్‌బీపల్లి, కొడిచర్ల తదితర గ్రామాల్లో పర్యటించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో నాకు ఓటేసి ఆదరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గ ప్రజలకు ఎల్లవేలలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లష్కర్‌నాయక్, మోహన్ సింగ్, సుధాకర్, యాదయ్య, రాఘవేందర్, పాపిరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో రమ్య సుచరితకు డాక్టరేట్



డాక్టరేట్ అందజేస్తున్న డాక్టర్ సాత్వికారెడ్డి

మొయినాబాద్‌రూరల్: కష్టపడి చదివితే విజయం వరిస్తుందని చైతన్య డీమ్డ్ వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్విక రెడ్డి అన్నారు. కళాశాలకు చెందిన రమ్యసుచరిత ఇమ్మడి రసాయన శాస్త్ర విభాగంలో డాక్టర్ ఎస్.నర్సింహ పర్యవేక్షణలో చేపట్టిన పరిశోధనలకు ఆమెకు డాక్టరేట్ వచ్చింది. ఈ పట్టాను మంగళవారం కళాశాలలో వర్సిటీ వీసీ పురుషోత్తంరెడ్డి, సాత్వికారెడ్డి ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, రీసర్చ్ డీన్ కిష్టఫర్, జగదీశ్‌కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకోండి

శంకర్‌పల్లి: ఓటరు జాబితాలో తప్పులుంటే సరి చేసుకోవాలని శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంక సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్ వైజర్‌లకు ఆమె ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో తప్పును సవరించడంతో పాటు పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటు ప్రక్రియ ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా హనుమాన్ పునశ్చరణ

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో భక్తులు మంగళవారం పునశ్చరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వందేళ్ల చరిత్ర ఉన్న హనుమాన్ ఆలయంలో పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా భక్తులు హోమం, హనుమాన్ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు గ్రామానికి చెందిన పిప్పళ్ల జంగయ్య అన్నదానం చేశారు. సర్పంచ్ కళమ్మ, ఉప సర్పంచ్ నీల లావణ్య, మాజీ సర్పంచ్ అంజయ్య, లింగారెడ్డి, వెంకటయ్య, పాండు, శేఖర్, బారప్ప, కోటేశ్వర్, నగేశ్, నరసింహ, కుమార్, రాధాకృష్ణ, రాజు, మహేశ్, గణేశ్, రమేశ్‌గౌడ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’.. ఇదేం వ్యథ

- రోడ్డు విస్తరణ పనుల్లో ప్రధాన పైప్‌లైన్ ధ్వంసం
- రెండేళ్లుగా నీటిసరఫరా బంద్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



నందిగామ కల్వర్టు వద్ద పైపులు పగలడంతో నిండుకున్న నీరు(ఫైల్)



విస్తరణ పనులతో రోడ్డు మధ్యలో కంట్రోల్ వాల్వ్

కొత్తూరు: మిషన్‌భగీరథ.. ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో మున్సిపాలిటీతో పాటుగా నందిగామ, కొత్తూరు మండల పరిధిలోని 22 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. రెండేళ్లుగా పంచాయతీ బోర్ నుంచి సరఫరా అవుతున్న నీటినే వినియోగిస్తున్నారు. ఇరుశాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లగా.. ప్రజలకు భగీరథ తాగునీరందక ఇబ్బంది పడుతున్నారు.

ఐదేళ్ల క్రితం శంకుస్థాపన

ఐదేళ్ల క్రితం అప్పటి మంత్రి కేటీఆర్ కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు ఉన్న పాత జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రెండేళ్ల క్రితం రూ.67 కోట్లతో సుమారు 11 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి పనులు ప్రారంభమయ్యాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ తమ నిబంధనల మేరకు 11 కిలోమీటర్ల దూరం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల తొలగించేందుకు ట్రాన్స్‌కో అధికారుల అనుమతి తీసుకుని పనులు చేపట్టారు.

కొరవడిన శాఖల సమన్వయం

రోడ్డు విస్తరణలో భాగంగా 11 కిలోమీటర్ల పరిధిలో 1 భారీ వంతెన, 4 చోట్ల కల్వర్టులను నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణంలో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు తవ్వకాలు జరపడంతో మొత్తం ఎనిమిది చోట్ల పైప్‌లైన్ ధ్వంసమైనట్లు భగీరథ అధికారులు వెల్లడిస్తున్నారు. తమకు సమాచారం లేకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు తవ్వకాలు జరిపారని మిషన్ భగీరథ అధికారులు.. తమ శాఖ అనుమతి లేనిదే రోడ్డుకు సమీపంలో పైపులైన్ ఎలా వేశారు..? అని ఆర్‌అండ్‌బీ అధికారులు అప్పట్లో తప్పును ఒకరిపై మరొకరు నెట్టుకున్నారు.

మరమ్మతులకు రూ.10కోట్లు

ఇరు శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంచాయితీ సంబంధిత శాఖల ఉన్నతాధికారుల వద్దకు చేరింది. ఇరు శాఖల ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే అంచనా వేసిన మిషన్‌భగీరథ అధికారులు ధ్వంసమైన పైపులకు మరమ్మతులు.. కొన్ని చోట్ల షిఫ్టింగ్..కంట్రోల్ వాల్వ్‌ల తరలింపురకు రూ.10 కోట్ల వరకు నిధులు అవసరమని తేల్చారు. ఇటీవల నందిగామ మండల పరిధిలోని పది గ్రామాలకు నీటిసరఫరా పునరుద్ధరించగా.. కొత్తూరు మున్సిపాలిటీతో పాటుగా మిగిలిన గ్రామాలకు నేటికీ సరఫరా అవ్వడం లేదు.

పనులు కొనసాగుతున్నాయి

రోడ్డు విస్తరణలో ప్రధాన పైప్‌లైన్ ధ్వంసమైంది. ప్రస్తుతం పదిగ్రామాలకు సరఫరా పునరుద్ధరించాం. మిగిలిన మరమ్మతులు పూర్తిచేసి వచ్చే ఏడాది జనవరిలోగా కొత్తూరు మున్సిపాలిటీ, గ్రామాలకు నీటిని సరఫరా చేసే విధంగా పనులు చేపడుతున్నాం.

– నరేష్‌రెడ్డి, మిషన్‌భగీరథ ఏఈ, కొత్తూరు

‘గృహలక్ష్మి’కి గుడ్‌బై!

ఇందిరమ్మ ఇళ్లకే కొత్త సర్కార్ మొగ్గు

- సొంత జాగా ఉన్నవారికి సాయం పెంచే యోచన
- మార్గదర్శకాలకోసం పేదల ఎదురుచూపులు



షాబాద్: కొత్తగా అధికారం స్వీకరించిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చిన గృహలక్ష్మి పథకానికి గుడ్‌బై చెప్పింది. గత ప్రభుత్వం హయాంలో కేవలం పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి పరిమితం చేశారు. ఇవి కూడా నత్తనడక సాగడం.. నిర్మించిన చోట పంపిణీ సైతం ఆలస్యమవ్వడంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పలేదు. చివరకు ఎన్నికల ముందు సొంత జాగా ఉండి ఇంటిని నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సాయం అందించే కార్యక్రమం చేపట్టారు. సరైన దిశానిర్దేశం లేకపోవడంతో గృహలక్ష్మి పథకం కింద ఎవరికి సాయం అందించలేదు. సాయం మంజూరుకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను జారీ చేసినా వాటిపై అధికారులు సంతకాలు లేకపోవడంతో ఎన్నికల స్టంటే అని అనేకమంది కొట్టిపారేశారు. ఒక్కో నియోజకవర్గానికి 3వేల ఇళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఎక్కడ కూడా గృహలక్ష్మి పథకం కింద లబ్ధి పొందిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒక్కటి, ఓసీ, బీసీలకు ఇంటిని నిర్మించుకుంటే రూ. 5లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున సాయం అందిస్తామని ప్రకటించారు.

ఏడాదికి ఎన్ని..?

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించింది. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీకి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తేనే లబ్ధిదారుల ఎంపిక సాగుతుంది. ఒక్కో నియోజకవర్గానికి ఏడాదికి ఎన్ని ఇళ్ల నిర్మాణానికి సాయం అందిస్తారనే అంశంపై ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలతో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థను రద్దు చేసింది. ఈ సంస్థ ఉద్యోగులను వివిధ ఇంజనీరింగ్ శాఖలలో విలీనం చేశారు. గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఉన్నా అధికారుల బృందం లేకుండానే కార్యకలాపాలను సాగించడం గమనర్హం. డబుల్ ఇళ్ల నిర్మాణాన్ని కొన్ని చోట్ల రోడ్లు భవనాల శాఖ, మరికొన్ని చోట్ల ఇరిగేషన్ శాఖలు పర్యవేక్షించాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తే ఏ శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. లేదా గృహనిర్మాణ సంస్థను పునరుద్ధరిస్తారా అనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

చలి ప్రభావం నుంచి నారును రక్షించుకోవాలి

మండల వ్యవసాయాధికారి రాగమ్మ



శ్రీరాంనగర్‌లో నారుమడిని పరిశీలిస్తున్న రాగమ్మ

మొయినాబాద్: వరి సాగు చేసే రైతులు చలి ప్రభావం నుంచి నారుమడులను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాగమ్మ అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో మంగళవారం ఆమె పర్యటించి వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. చలి ప్రభావం వల్ల నారు మడుల్లో నారు ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగులో మారి కొన్ని సార్లు నారు చనిపోతుందన్నారు. దాని నుంచి రక్షించుకోవడానికి నారుమడుల్లో సాయంత్రం పూట నీరు పూర్తిగా తీసివేసి ఉదయం పూట వెచ్చని నీళ్లు పెట్టాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిపై సన్నని ప్లాస్టిక్ షీట్‌తోగాని, కల్లాల పట్టాతో గాని నారుమడి మీద కప్పి, మరుసటి రోజు ఉదయం తీసివేయాలని చెప్పారు. ఆకులపై మచ్చలు ఏర్పడకుండా జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. నారు ఆరోగ్యంగా పెరగడానికి యూరియా వేసేటప్పుడు అందులో కిలోకి 2 గ్రాములు కార్బెండాజిమ్, మాంకోజెబ్ కలపాలన్నారు. కాండం తొలిచే పురుగు బారి నుండి కాపాడుకోవడానికి కార్బొఫ్యురాన్ 3 జీ గులుళికలు చల్లాలని, అగ్గితెగులు రాకుండా ట్రైజైక్లోజూల్ లీటరు నీటికి 0.6 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

కొరివి కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం



కొరివి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

షాబాద్: ముదిరాజ్ సంక్షేమానికి కొరివి కృష్ణస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు లింగం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో కొరివి కృష్ణస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, సంఘం నాయకులు మాసయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, జనార్ధన్, యాదగిరి, పోచయ్య, తదితరులున్నారు.

సహకార సంఘాల సంక్షేమానికి కృషి

ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సహకార సంఘాల అభివృద్ధికి రైతులు కృషిచేయాలని ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ పాలకవర్గం సమావేశం చైర్మన్ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం ప్రస్తుతం రూ.55 లక్షల ఆదాయంతో నడుస్తుందన్నారు. బంగారు రుణాలపై గతంలో గ్రాముకు రూ.4వేలు ఉంటే ప్రస్తుతం మరో రూ.400 పెంచామన్నారు. పాలకవర్గం సమిష్టి నిర్ణయంతో ముందుకు పోతున్నామన్నారు. సంఘం సభ్యుల కోరిక మేరకు పెద్ద పెద్ద లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఖాళీ స్థలంలో రూ.50 లక్షలతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రుణాల వసుళ్ల సకాలంలో చేసి దీర్ఘ కాలిక రుణాలు రైతులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సామల రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, లింగారెడ్డి, యాదయ్యగౌడ్ మక్కపల్లి అంజయ్య, నిట్టు యాదమ్మ, తోట్ల యాదమ్మ, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు సీఈఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభను వెలికితీయాలి

ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు: పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. విద్యార్థులు తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవీ కళ్యాణ మండపంలో జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం చూచిరాత పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 425 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు పరీక్ష పత్రాలను సీఐ వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జ్ఞానవాహిని ఫౌండేషన్ నిర్వాహకులు పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ ఎంపీపీ తల్లోజు లలితమ్మ, ఎస్ఐ బాల్‌రాం, జ్ఞానవాహిని ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి రవీంద్రానంద్, సభ్యులు బికుమాండ్ల నర్సింహా, సత్యం, రంగారావ్, జగదీశ్, యాదగిరి, దినేశ్, తదితరులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 28న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను బహూకరిస్తున్న యాదవ సంఘం నాయకులు

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం తపిస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బడుగుల సంక్షేమానికి ప్రభుత్వం కొత్త పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆరుగ్యారెంటీలపైనే తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, పెన్షనర్లు, అన్ని రంగాల్లో పని చేస్తున్న వారు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. దీంతో విసుగు చెందిన ప్రజలు ఓటు అనే ఆయుధంతో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పారని అన్నారు. ఈసందర్భంగా చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాలరెడ్డి, బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, జమ్రుద్‌ఖాన్, బస్వం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

మున్సిపాలిటీ పరిధిలోని కేకేఆర్ కన్వెన్షన్ హాల్‌లో చటాన్‌పల్లి యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు రుమాలు, గొంగడి, గొర్రె పిల్లను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నక్క బాలరాజు, కుమార్ యాదవ శ్రీశైలం, శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దైవ సమానులు

షాద్‌నగర్ రూరల్: వైద్యులు దైవ సమానులని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యేను స్థానిక వైద్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు భవిష్యత్‌లో మీకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బండారి రమేశ్, ప్రేమ్ సాయికుమార్, శివానంద్, సురేశ్, నాగవర్ధన్‌రెడ్డి, కార్తీక్, అరుణ్, లాల్‌కుమార్, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా మెలుగుదాం

కొందుర్గు: రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు అధికారులు ప్రగతినివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రారంభం కానీ పనుల వివరాలను అందజేయాలని పీఆర్ ఏఈ దయాకర్‌కు సూచించారు. మోటర్ల మరమ్మతు కారణంగా మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జయశ్రీ తెలుపగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామాల్లో రేషన్ బియ్యం సరఫరా సమస్య రాకుండా చూసుకోవాలని తహసీల్దార్ రమేశ్ కుమార్‌కు సూచించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పులుసుమామిడి సర్పంచ్ షరీఫాబేగం కోరారు. శ్రీరంగాపూర్ పాఠశాల అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ లింగం కోరారు. సర్వేయర్‌ను అందుబాటులో ఉంచాలని ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి కోరారు. ఉత్తరాసిపల్లిలో అంగన్‌వాడీ భవనం మంజూరి చేయించాలని ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, ఎంపీడీఓ అంజనేయులు, ఎంపీఓ లాలయ్యతోపాటు వివిద గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ కరపత్రాల విడుదల

కొందుర్గులో జనవరి 13, 14న నిర్వహించే 17వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే శంకర్ విడుదల చేశారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం కొందుర్గు శివారులోని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడే ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలి రాజు, సర్పంచ్ ఆదిలక్ష్మి, నాయకులు పురుషోత్తం రెడ్డి, నరేందర్, గోవర్దన్ గౌడ్, మల్లేశ్ గౌడ్, రామయ్య గౌడ్, కావలి యాదయ్య, మహేందర్, రవి, మాసయ్య గౌడ్ పాల్గొన్నారు.

స్పీకర్‌కు ఘన సన్మానం



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర నూతన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మండల పరిధిలోని పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు మానయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

నూతన మంత్రులకు అభినందనలు

మొయినాబాద్: టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిశారు. మంగళవారం ఆయన మంత్రులను వేర్వేరుగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివ సేనారెడ్డి, టీపీసీసీ నేతలు వెంకట్‌రామ్‌రెడ్డి, కైలాష్ తదితరులున్నారు.



సీతక్కను సన్మానిస్తున్న గౌరి సతీశ్

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



స్వామి వారి ఊరేగింపు



షాబాద్: ముద్దెంగూడలో అయ్యప్పపడిపూజ

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో ఆలయ పంచమ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. భక్తి గీతాలతో, అయ్యప్ప నామస్మరణతో గ్రామం మార్మోగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మర్రి రాంరెడ్డి, మర్రి నాగమల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడానికి సహకరించండి



ఆర్థికసాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని రాధాకృష్ణ చారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన అంజమ్మ, తాహెరాబేగం, ప్రవీణ్ కుటుంబ సభ్యు లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మూడు కుటుంబాలకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ మండల పరిధిలో పేదలకు ఏ ఆపద వచ్చిన సాధ్యమైనంత వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, వీరయ్య, గంప శ్రీను, లాయక్‌అలీ, పాండు, హర్యానాయక్, శ్రీను, అంజి, ఇర్షాద్, కృష్ణ, శ్రీకాంత్, శ్రీశైలం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.